క్లుప్తంగా

గవర్నర్‌కు ఎమ్మెల్సీ తలశిల రఘురాం శుభాకాంక్షలు



గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులకు ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

క్యాలెండర్ల పంపిణీ



క్యాలెండర్లను పంపిణీ చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యాన బాబా వారి క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి పాల్గొని బాబావారి క్యాలెండర్‌లను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏటా తాము సుమారు రెండు లక్షల వ్యయంతో బాబావారి క్యాలెండర్లను భక్తులకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. తొలుత బాబాకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

ఆర్టీసీ ఎండీ ద్వారకతిరుమలరావు



ఆర్టీసీ ఎండీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ వెల్ఫేర్ నాయకులు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఆర్టీసీ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు పేర్కొన్నారు. ఆర్టీసీ హౌస్‌లోని ఆయన కార్యలయంలో ఎండీని ఆదివారం ప్రజా రవాణాసంస్థ బీసీ వెల్ఫేర్ నాయకులు కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారికి సంస్థ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సంస్థను ప్రగతి పథంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు, కమిటీ సభ్యులు డి.వెంకటపతి, కొటేశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శం



సభలో మాట్లాడుతున్న డేవిడ్‌రాజు, వేదికమీద కొప్పుల ఆనంద్, మల్లాది స్వాతి

విజయవాడ కల్చరల్: భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శమని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు అన్నారు. బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ, ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్త పూర్ణానందం కళావేదిక మీద అంబేడ్కర్ స్ఫూర్తిసభ, నూతన సంవత్సవ వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న మహనీయుడు అంబేడ్కర్ అభివర్ణించారు. సినీ నటుడు కొప్పుల ఆనంద్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం సంస్థ కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్వరాజ్యమైదానంలో అంబేడ్కర్ స్మృతి వనం నిర్మిస్తున్న ప్రభుత్వం కృషిని అభినందించారు. బీవీ వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు ప్రసంగించారు. మల్లాది స్వాతి, ఆదిరాల జయప్రభ, అమలారాణి పలు చిత్ర గీతాలను ఆలపించారు.

కిటకిటలాడిన దాసాంజనేయ ఆలయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామికి పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. 150 మంది వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ పర్యవేక్షించారు.

పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం
- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు



లబ్ధిదారులతో కలసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ పింఛన్ కానుక పెంపుతో రాష్ట్రంలో పండగ వాతావరణం నెలకుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే సత్యనారాయణపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, పార్టీ నేతలతో కలసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం పెంచిన పింఛన్‌ను అందజేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అవ్వాతాతలకు, వితంతువుల పింఛన్ రూ. 2,750కు పెంచడంపై లబ్ధిదారులతో కలసి ఆయన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు గత పాలనలో పింఛనుదారులలో ఒకరు చనిపోతే తప్ప మరొకరికి పింఛన్ ఇచ్చే వారు కాదన్నారు. అటువంటి అమానవీయమైన విధానానికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్వస్తి పలికారన్నారు.

చంద్రబాబు హయాంలో వ్యవస్థలన్నీ అవినీతిమయం

చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పింఛన్ల వ్యవస్థను పూర్తి అవినీతిమయం చేశారని మల్లాది విష్ణు ఆరోపించారు. ఇన్‌కం ట్యాక్స్ చెల్లించే వారికి, ఖరీదైన కార్లలో తిరిగే వారికి పింఛన్‌ను మంజూరు చేసిన ఘనత గత టీడీపీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. కొత్తగా ఏ ఒక్క పింఛన్ మంజూరు చేసినా మూడు నెలల పింఛన్ మొత్తాన్ని లంచంగా చెల్లించాల్సి వచ్చేదని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా లబ్ధిదారులు ఉన్న చోటుకే వలంటీర్లు వెళ్లి పింఛన్ అందించే విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సెలవు రోజైనా ఇంటి వద్దకు వెళ్లి పింఛన్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. డోర్ డెలివరీ పద్ధతిలో పెన్షన్లు అందించడం దేశంలోనే తొలిసారి అని పేర్కొన్నారు.

పింఛన్లపై నీచ రాజకీయాలు మానుకోవాలి

పింఛన్లపై మాట్లాడే నైతిక అర్హత రాష్ట్రంలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి లేదని మల్లాది విష్ణు పేర్కొన్నారు. అవ్వాతాతలకు అందించే పింఛన్లలోనూ ప్రతిపక్షాలు నీచ రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏటా జరిగే సామాజిక సర్వేని కూడా వక్రీకరించి పింఛన్లను తొలగిస్తున్నారంటూ లబ్ధిదారులను భయాందోళనలకు గురిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఏ ఒక్క పింఛన్‌ను కూడా ప్రభుత్వం తొలగించలేదని, నోటీసులు ఇచ్చిన వారికి సైతం పింఛన్లు అందించినట్లు మల్లాది విష్ణు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీడీఓ జగదీశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌లో..

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్ తదితరప్రాంతాల్లో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలతో కలిసి ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే మల్లాది విష్ణు పింఛన్లు పంపిణీ చేశారు.

అవ్వాతాతలకు అండగా సీఎం జగన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): అవ్వాతాతలు, దివ్యాంగులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష అన్నారు. స్థానిక 31వ డివిజన్‌లో ఆదివారం వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

61వ డివిజన్లో పింఛన్ల పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): వీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి ఆదివారం 61వ డివిజన్‌లోని లబ్ధిదారులకు ఆమె పార్టీ నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త సంవత్సరం నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.2,500 నుంచి రూ.2,750కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచారన్నారు. లబ్ధిదారులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్, డివిజన్ నాయకులు నాలం బాబు, మురళి, ఆర్‌ఎస్ నాయుడు, సుబ్బారెడ్డి, వెంకట్, నాగిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

64వ డివిజన్లో..

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం 64వ డివిజన్లో 1996 మంది లబ్ధిదారులకు కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ ఆదివారం పెన్షన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి యర్రగొర్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



పెంచిన పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పెనుమత్స శిరీష



పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి

పింఛన్ల పెంపుతో 'నూతన' సంతోషం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కొత్త సంవత్సరం రోజున రాష్ట్రంలోని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు అందించే పింఛన్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2,750 పెంచి, లబ్ధిదారుల జీవితాల్లో నూతన సంతోషాన్ని పంచారని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన 52 మంది పెన్షన్‌దారులకు కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానాతో కలిసి ఆదివారం పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల మనసెరిగిన ముఖ్యమంత్రి మన జగనన్న అని, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని ఆకాంక్షించే వ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా లభించడం మన అందరి అదృష్టమన్నారు. కార్పొరేషన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అధికారి జగదీశ్వరీ, సీఓ విద్యాసాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు సురేష్, ఎండీ హఫీజుల్లా, కంభగళ్ల రాజు, కొండా జయలక్ష్మి, అమిత్ పాల్గొన్నారు.

పింఛన్ కానుక పెంపుతో పండగ వాతావరణం

వైఎస్సార్ పింఛన్ కానుక పెంపుతో రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణం వచ్చిందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సింగ్‌నగర్, వాంబేకాలనీ ప్రాంతాల్లో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం కేవలం 39 లక్షల మందికి మాత్రమే పింఛన్లను ఇచ్చిందని, నేడు ఏకంగా 64.06 లక్షల మందికి పింఛన్లు అందించడంతో పాటు పింఛన్ అర్హతను 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించామని తెలిపారు. పింఛన్‌దారులకు మేలు చేస్తున్నా కూడా టీడీపీ నాయకులు మాత్రం దీనిపై నీచ రాజకీయాలు చేయడం, అసత్య ఆరోపణలు చేసి ప్రభుత్వంపై బురద చల్లాలని చూడడం దౌర్భాగ్యమన్నారు. కార్పొరేషన్ సీడీఓ జగదీశ్వరీ, కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, కోఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్ పాల్గొన్నారు.

57, 58 డివిజన్లలో..

స్థానిక 57, 58 డివిజన్లలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి ఇంటింటికి తిరిగి పింఛన్లను అందజేశారు.



సింగ్‌నగర్‌లో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్ షాహీనా సుల్తానా



వాంబేకాలనీలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు



58వ డివిజన్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీశైలజ



పాస్టర్లకు నూతన వస్త్రాలను అందిస్తున్న డాక్టర్ కోనేరు సత్యప్రియ, ట్రస్ట్ పెద్దలు

పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి ఉంటుందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా పేర్కొన్నారు. దివంగత ఎమ్మెల్సీ ఎండీ కరీమున్నీసా పేరుమీద మాదిగ చర్మకార, డప్పు కళాకారుల పోరాట సమితి(ఎంసీడీకేపీఎస్) ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లోని చల్లగాలి ఐజయ్య రోడ్డులో ఆదివారం పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ పేదలకు, ఆపదలో ఉన్న వారికి సాయం చేయడం అంటే ఆ భగవంతునికి సేవ చేయడంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని, సమాజానికి ఉపయోగపడేలా మంచి కార్యక్రమాలు చేయాలని సూచించారు. నూతన సంవత్సరం రోజున పేదల జీవితాల్లో కూడా సంతోషం ఉండాలనే ఆకాంక్షతో ఎంసీడీకేపీఎస్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ ఈ లోకంలో మనిషికి మనిషే సాయం చేసుకోవాలన్నారు. మన కళ్లముందు కనిపిస్తున్న వారికి తమవంతు సాయాన్ని అందించేందుకు ఎప్పుడు వెనుకాడకూడదన్నారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతిఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఎండీ హఫీజుల్లా, గెల్లిపోగు రాజు, చల్లగాలి భాను పాల్గొన్నారు.

నూతన వస్త్రాలు అందజేత

నూతన సంవత్సరం సందర్భంగా ది సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వితంతువులు, పాస్టర్లకు ఆదివారం నూతన వస్త్రాలను అందజేశారు. ఏపీ లిడ్ క్యాప్ డైరక్టర్ డాక్టర్ కోనేరు సత్యప్రియ ముఖ్యఅతిథిగా హాజరై వారితో కలిసి కేకు కట్‌చేసి, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ది సేవ ఫౌండేషన్ ఫౌండర్ జడ డేనియేల్ ప్రిన్స్, సీఈఓ నవీన్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యామ్, పాస్టర్ జాన్‌బాబు, చల్లగాలి సందీప్, పాస్టర్ శ్యాంసన్ పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్ షాహీనా సుల్తానా

5న సీజ్డ్ వాహనాల వేలం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) భవానీపురం స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన వాహనాలను ఈ నెల 5వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు స్టేషన్ వద్ద వేలం నిర్వహించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో వాహనాల సంఖ్య 17 కాగా వాటిల్లో మూడు కార్లు, 14 ద్విచక్రవాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా ఫోర్ వీలర్స్‌కు రూ.10వేలు, ద్విచక్రవాహనాలకు రూ.5వేలు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రీఫండబుల్) కింద చెల్లించాలని తెలిపారు. వేలంలో పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలంపాటకు సంబంధించిన పూర్తి వివరాల కోసం హెడ్ కానిస్టేబుల్ వీవీ వేణుగోపాలరావు ఫోన్ నంబర్ 99493 69538, కానిస్టేబుల్ సీహెచ్ సుబ్రహ్మణ్యం ఫోన్ 80742 69210లో సంప్రదించాలని కోరారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలి

పాయకాపురం(విజయవాడరూరల్): హిందూ దేవుళ్లను, అయ్యప్ప స్వామిని దూషించిన నాస్తిక సంఘం అధ్యక్షుడు బైరి నరేష్‌పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని వీహెచ్‌పీ నగర కార్యదర్శి పి.రాఘవరాజు డిమాండ్ చేశారు. బైరి నరేష్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు దీపాలతో పాయకాపురంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రకాష్‌నగర్ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద నుంచి నున్న రూరల్ పోలీసు స్టేషన్ వరకు ప్రదర్శనగా వెళ్లి, ఎస్సై గోవిందుకు ఫిర్యాదు కాపీని అందజేశారు.

డీజీపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు



డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీ రాణా

విజయవాడ స్పోర్ట్స్: డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీ కార్యాలయంలో రాజేంద్రనాథ్‌రెడ్డిని ఆదివారం కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. సీపీ రాణా వెంట డీసీపీ విశాల్ గున్ని ఉన్నారు.

రవాణాశాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీటీసీ పురేంద్ర

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అధికారులు, ఉద్యోగులు శాఖాపరంగా తమకు అప్పగించిన బాధ్యతలను ఇష్టంగా చేసినప్పుడే మంచి పేరు వస్తుందని డీటీసీ ఎం.పురేంద్ర అన్నారు. స్థానిక బందర్ రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోన్- 2 అధ్యక్షుడు ఎం.రాజుబాబు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురేంద్ర మాట్లాడుతూ రవాణాశాఖ అధికారులు ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తున్నారన్నారు. శాఖాపరంగా జిల్లాలోని ప్రజలు కోరుకున్న సేవలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో ముందుంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని అధికారులను ఉద్యోగులను డీటీసీ అభినందించారు. శాఖాపరంగా అందరూ కష్టించి పని చేసి 2023 సంవత్సరంలో కూడా జిల్లా రవాణాశాఖను ఉత్తమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓలు ఆర్.జగదేశ్వరరాజు, ఎం.పద్మావతి, టెక్నికల్ అధికారుల సంఘం నాయకులు ఆర్.ప్రవీణ్, నారాయణ రాజు, వెంకటేశ్వరరావు, రాంబాబు, సంఘం జోనల్ కార్యదర్శి కేవీవీ నాగ మురళి, సహాధ్యక్షులు జి.ఉషసుందరి, కార్యాలయ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, మాణిక్యాలరావు, పి.కవిత, ప్రభాకర లింగం, ఉద్యోగ సంఘ నాయకులు బి చంద్రశేఖర్, రామచంద్రరాజు, జోగారావు పాల్గొన్నారు.

అందరికీ మంచి జరగాలి



డాక్టర్ పూనూరు గౌతంరెడ్డిని సత్కరిస్తున్న యాదల శ్రీనివాసరావు, చిన్నా, వైఎస్సార్ సీపీ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్థిల్లాని ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన కేక్‌ను కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కొత్త సంవత్సరంలో కొత్త వెలుగులు ప్రసరిస్తాయన్నారు. అనంతరం మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సామంతపూడి చిన్నా తదితరులు గౌతంరెడ్డిని ఘనంగా సత్కరించారు.

కోటి రుద్రాక్ష అభిషేక అర్చనలో పాల్గొనాలి



కోటి రుద్రాక్ష అభిషేక ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిరిడీ ముత్యాలంపాడు షిరిడీసాయిబాబా మందిరంలో లోక కళ్యాణార్థం ఏర్పాటు చేసిన కోటి రుద్రాక్ష అభిషేక అర్చనలో భక్తులు పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. స్థానిక ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం ధనుర్మాసోత్సవాలలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన కోటి రుద్రాక్ష అభిషేక అర్చన ఏర్పాట్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత ధనుర్మాసోత్సవాలలో స్వామిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్య శ్రీహరి, ఆలయకమిటీ సభ్యులు మల్లాది విష్ణును ఘనంగా సత్కరించారు. అలాగే మధురానగర్ శ్రీ భగవాన్ షిరిడీసాయిబాబా మందిరంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ధనుర్మాసోత్సవాలలో మల్లాది విష్ణు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్‌ఎన్ రాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఉత్తర్వులు మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్-1 విజయవాడ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌టౌన్ కొత్తపేట కేంద్రంలో-6 (బీసీ-డీ/48వ డివిజన్), కెఎల్‌రావునగర్-1(ఎస్సీ/47వ డివిజన్), వాంబే కాలనీలో-2 (బీసీ-డీ/60వ డివిజన్), వాంబేకాలనీ-16(ఓసీ/60వ డివిజన్), వాంబే కాలనీ-24(ఓసీ/61వ డివిజన్), కండ్రిక-7(బీసీ-డీ/64వ డివిజన్), మిల్క్ ప్రాజెక్ట్-3(ఓసీ/46వ డివిజన్) అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు ఆ ప్రాంతానికి చెందిన వివాహితురాలైన అభ్యర్థినుల మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుపై ఏ ఏరియా అంగన్‌వాడీ కేంద్రానికి దరఖాస్తు చేస్తున్నారో స్పష్టంగా రాయాలని సూచించారు.

అర్హతలు ఇలా..

సహాయకురాలి పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణురాలై, స్థానిక వివాహిత మహిళా అభ్యర్థినులు 1-07-2022 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థినులు కుల ధ్రువీకరణ పత్రాలు జతపరచాలి. నివాస ధ్రువ పత్రం, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ జతపరచాలి. దరఖాస్తు ఫారాలు కార్యాలయంలో మాత్రమే ఇస్తారు. ఆయా పోస్టులకు విద్యార్హత, తగిన కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డ్స్ జిరాక్స్ కాపీలతో పాటు ప్రస్తుత పాస్‌పోర్ట్ సైజు ఫొటో (గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్ట్ చేయించి) జతపరిచి, ఈ నెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు (పూర్తి పనిదినాలలో) ఉమాశంకర్‌నగర్, 1వ లైన్, ఎస్ఎన్ఆర్ అకాడమీ, కానూరు, గ్రౌండ్‌ఫ్లోర్ లోగల సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్-1 విజయవాడ కార్యాలయంలో దరఖాస్తులను వ్యక్తిగతంగా అందచేయాలని పేర్కొన్నారు.

ఇతర వివరాలకు 94408 14595లో సంప్రదించాలని కోరారు.